డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డికి మంత్రి, ఎమ్మెల్యేల పరామర్శ

కొండల్‌రెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గుండాల, నవంబర్ 18 : డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి తండ్రి కొండల్‌రెడ్డి (95) అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌ని ఆసుపత్రిలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్ సోమవారం మండలంలోని నూనెగూడెం గ్రామంలో సంజీవరెడ్డిని పరామర్శించారు. కొండల్‌రెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పించారు.

పత్తి కొనుగోలు కేంద్రం తనిఖీ

శారాజీపేటలో కొనుగోలు కేంద్రం వద్ద పత్తిని పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

ఆలేరు రూరల్, నవంబర్ 18 : మండలంలోని శారాజీపేట పత్తి కొనుగోలు కేంద్రాన్ని భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి కొనుగోలు తీరుపై ఆరా తీశారు. సిబ్బంది వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తి కొనుగోలుకు సంబంధించి సిబ్బందికి సూచనలు చేశారు.

రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు

- తాసీల్దార్ మహేందర్‌రెడ్డి

జిబ్లక్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న తాసీల్దార్ మహేందర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18 : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తాసీల్దార్ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. మున్సిపాలిటీలోని రేషన్ షాపులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. మండలంలోని జిబ్లక్‌పల్లి, దోతీగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో ఇంటింటి కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా సమగ్ర వివరాలను నమోదు చేయాలన్నారు. కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యాన్ని శుభ్రం చేసుకోవాలని, 17శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఎన్యూమరేటర్లు, రైతులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అజీంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ శేషగిరిరావు

అడ్డగూడూరు, నవంబర్ 18 : అడ్డగూడూరు, అజీంపేటలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాసీల్దార్ శేషగిరిరావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతులు శుభ్రం చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని, దళారులకు విక్రయించకూడదని సూచించారు. ఆయన వెంట సీఈఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ నవనీత పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

రహీంఖాన్‌పేట రేషన్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న తాసీల్దార్ రవికుమార్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 18 : మండల కేంద్రంతోపాటు రహీంఖాన్‌పేటలోని రేషన్ షాపులను తాసీల్దార్ రవికుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుదారుల జాబితాను, రికార్డులను పరిశీలించారు. ప్రతి కార్డుదారుడికి ప్రభుత్వం అందజేస్తున్న బియ్యం, సరుకులను అందివ్వాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి : ఎంఈఓ

మల్కంబ్ క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చౌటుప్పల్, నవంబర్ 18 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ గురువారావు అన్నారు. పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి మల్కంబ్ క్రీడా జట్ల ఎంపికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడలు దేహదారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీలు పి.కృష్ణమూర్తి గౌడ్, వి.బిక్కు, ట్రినిటీ పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

కనకదుర్గమ్మ ఆలయంలోని ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 18 : మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ ఆలయానికి కార్తిక సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం దాతలు ఏనుగు సునంద, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో కార్తిక పూజలు

రామలింగేశ్వరస్వామి ఆలయంలో లింగం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న పురోహితులు

యాదగిరిగుట్ట, నవంబర్ 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కార్తిక మాసం పూజలు ఘనంగా జరిగాయి. సోమవారం వేకువజామునే కొండపైకి చేరుకున్న భక్తులు స్వామివారి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిపారు. కొండ కింద వ్రత మండపం, పాతగుట్టలో సత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. 805 మంది దంపతులు వ్రతమాచరించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేపట్టారు. కార్తిక సోమవారం కావడంతో రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. 'ఓం', 'లింగం' ఆకారంలో దీపాలు వెలిగించారు. అనంతరం శివుడికి పూజలు జరిపారు. స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, కల్యాణోత్సవ సేవ, నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా సాగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ, తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవను అత్యంత వైభవంగా చేపట్టారు. రామలింగేశ్వర కుటుంబంతోపాటు ఆలయంలో స్ఫటిక లింగేశ్వరుడికి ప్రభాతవేళ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సుమారు గంటన్నర పాటు జరిపారు. సాయంత్రం రామలింగేశ్వరుడి సేవను శివాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. సుమారు 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.33,03,170 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారిని ఇటలీ దేశస్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

యువకుడి వేధింపులతో యువతి ఆత్మహత్య

భువనగిరి అర్బన్, నవంబర్ 18 : యువకుడి వేధింపులతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన హాసిని హైదరాబాద్‌లో ఉంటూ డిగ్రీ చదువుతుంది. భువనగిరిలో ఆమెతో పాటు చదువుకున్న పట్టణంలోని రాంనగర్‌కు చెందిన నిఖిల్ కూడా ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉంటున్నాడు. గతంలో పరిచయం ఉన్న హాసినికి నిఖిల్ పదేపదే ఫోన్ చేస్తూ అసభ్యకర మెసేజ్‌లు పంపుతూ వేధిస్తున్నాడు. దీంతో మనస్థాపానికి గురైన హాసిని ఆదివారం భువనగిరిలోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో హాసిని (19) ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతిచెందింది. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. హాసిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

ఆస్తి కోసం తండ్రిని కొట్టిన కొడుకులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18 : ఆస్తి కోసం కన్నతండ్రిని కొడుకులు కొట్టిన సంఘటన తాసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని దంతూరు గ్రామానికి చెందిన దోతి (జనిగల) రామయ్యకు నలుగురు కుమారులు. ఆయనకు రెండెకరాల 39 గుంటల భూమి ఉండగా.. ఒక కొడుకు జనిగల శ్రీశైలానికి గిఫ్ట్ ఇచ్చాడు. విషయం తెలుసుకున్న మిగతా కుమారులు, కుమార్తెలు మండల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో మంగళవారం మాట్లాడుకుందామని నిర్ణయించుకున్నారు. ఇంతలోనే ఆ భూమిని అమ్మేందుకుగాను శ్రీశైలం స్లాట్ బుక్ చేశాడు. విషయం తెలియడంతో మిగతావారు సోమవారం తాసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చారు. రిజిస్ట్రేషన్ కోసం తండ్రితో పాటు శ్రీశైలం రాగా.. ఉన్న భూమి మొత్తం ఒకరికే ఇస్తే మిగతా వారి పరిస్థితి ఏంటని తండ్రిని ప్రశ్నించారు. ఈ క్రమంలో వాగ్వాదం జరుగగా.. కుమారులు రామయ్యను కొట్టడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రామయ్యను ఆసుపత్రికి తరలించారు.

బుచ్చయ్య సేవలు మరువలేనివి

బొమ్మలరామారం, నవంబర్ 18 : మర్యాల గ్రామ అభివృద్ధికి మాజీ సర్పంచ్ దేశెట్టి బుచ్చయ్య చేసిన సేవలు మరువలేనివని భువనగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దేశెట్టి చంద్రశేఖర్, శ్రీను నాయక్ అన్నారు. దేశెట్టి బుచ్చయ్య ఏడవ వర్ధంతి సందర్భంగా మర్యాల గ్రామంలో సోమవారం ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మధుసూదన్‌రెడ్డి, చీర సత్యనారాయణ, ముద్దం సత్యనారాయణ, శ్రవణ్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, గణేశ్, శ్రీధర్, జమీల్, పోచయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సీత మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. 2006-07 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.30వేలు జమ చేసి మధు కుటుంబానికి మంగళవారం అందజేశారు. నగేశ్, కిరణ్, యాదగిరి, పరమేశ్, లింగస్వామి పాల్గొన్నారు.

కోర్టు ప్రతిపాదిత స్థలాన్ని మార్చవద్దు : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు పెంటయ్య

రామన్నపేట, నవంబర్ 18 : మండల కేంద్రంలో ప్రతిపాదించిన కోర్టు సముదాయాల భవనాన్ని కొమ్మాయిగూడెం రోడ్డులోని సంబన్ బోర్డు వద్దే నిర్మించాలని, చిట్యాల శివారులో నిర్మించాలనే ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య అన్నారు. సోమవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కొమ్మాయిగూడెం రోడ్డులో కోర్టు భవనాల కోసం 5ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ కేటాయించిందన్నారు. అక్కడ కోర్టు భవనాలను నిర్మిస్తే ఏడు మండలాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. చిట్యాల శివారులో క్వారీ, క్రషర్ మిల్లు ఉండడం వల్ల వాయు, శబ్ద కాలుష్యంతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మొదట కేటాయించిన స్థలంలో కోర్టు భవనాలను నిర్మించకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు బోయిని ఆనంద్, కందుల హన్మంతు, విజయ్‌భాస్కర్, రషీద్, గణేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించి మెస్ చార్జీలు పెంచాలి

కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 18 : మధ్యాహ్న భోజన వంట కార్మికులకు 9నెలల పెండింగ్ బిల్లులు చెల్లించి మెస్ చార్జీలను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించవద్దని, కార్మికులను అక్రమంగా తొలగించవద్దని కోరారు. కార్మికులకు ప్రమాద బీమా అమలు చేయాలని, వయస్సు పైబడిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి జగన్‌మోహన్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్‌బాబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్‌బేగం, నాయకులు గుర్రాల రాజమణి, అనసూర్య, సంధ్య, లక్ష్మి, మమత, వీరస్వామి, గౌసియా, వాణి, ఆండాలు, కృష్ణవేణి, సుగుణ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

జలాల్‌పూర్‌లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

బొమ్మలరామారం, నవంబర్ 18 : గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో సోమవారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రేషన్ కార్డులు, పింఛన్లు, రైతు భరోసా అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు గొలనుకొండ బ్రహ్మచారి, బాల మల్లు, పోశెట్టి, భీములు పాల్గొన్నారు.

'పేదలకు ఉచిత విద్య అందించాలి'

అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతి పత్రం ఇస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 18 : రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, ఉపాధి కల్పించి భూమి పంపిణీ చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్లా నరేందర్ అన్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ కె.గంగాధర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ కేజీ టు పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలన్నారు. ప్రతి గ్రామంలో ఆధునిక వసతులతో దవాఖాన నిర్మించి వైద్య సేవలను మెరుగుపరుచాలని కోరారు. డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి వినోద్‌యాదవ్, జిల్లా నాయకులు మహేశ్‌మహారాజ్, శ్రీకాంత్, శివ, రవి, అశోక్, సాయి, నరేందర్ పాల్గొన్నారు.

21న ఆందోళ్ మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 17 : మండలంలోని ఆందోళ్‌మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపును ఈ నెల 21న చేపట్టనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.మోహన్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపు పరిశీలనకు ప్రత్యేక అధికారిని నియమించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

జిందాషా మదార్ సాహెబ్ ఉర్సు పోస్టర్ ఆవిష్కరణ

ఉర్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

ఆలేరు టౌన్, నవంబర్ 18 : జిందాషా మదార్ సాహెబ్ ఉర్సు ఉత్సవాల గంధం ఊరేగింపు పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్ సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గా సంరక్షకుడు బీజని మధుకుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రామసముద్రం బైపాస్‌లోని దర్గా జిందాషా మదార్ సాహెబ్ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29న గంధం ఊరేగింపు ఉంటుందన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 1:30గంటలకు ఆలేరులోని కాటమయ్యనగర్‌లోని మదార్ ఇంటి దగ్గర నుంచి జిందాషా మదార్ బాబా దర్గా వద్దకు ఫకీర్లు, మర్వా బృందం గంధం ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 4:30కు దంబాల్ కార్యక్రమం, సాయంత్రం 6గంటలకు ఖవ్వాలి నిర్వహిస్తామని మధుకుమార్ తెలిపారు. 30న సాయంత్రం 6గంటలకు దర్గా వద్ద భక్తులు దీపారాధన (చిరాకా) నిర్వహిస్తారని చెప్పారు. డిసెంబర్ 1న ఆదివారం అమావాస్య రోజు మధ్యాహ్నం 2గంటలకు దర్గా వద్ద మదార్‌బాబా జికర్ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గంధం ఊరేగింపునకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దర్గా గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి, ఎండీ ఖాదర్ హాజరవుతారని మధుకుమార్ తెలిపారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్ట్

గిరిజన నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచిన పోలీసులు

తుర్కపల్లి, నవంబర్ 18 : ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో గిరిజనులను పోలీసులు కొట్టి అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ లంబాడ హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు చలో లగచర్ల కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మండలంలోని వివిధ తండాలకు చెందిన గిరిజన సంఘాల నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్యా సంతోష్‌నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లతోపాటు పలు తండాలకు చెందిన గిరిజనులకు సంబంధించిన భూములను ఫార్మా కంపెనీ కోసం గుంజుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ క్రమంలో తండాకు వచ్చిన అధికారులను గిరిజనులు అడ్డుకోవడంతో అర్ధరాత్రి పోలీసులు ఇండ్లల్లోకి చొరబడి మహిళలు, పిల్లలు అని చూడకుండా చితకబాది అరెస్ట్ చేశారని తెలిపారు. లగచర్ల బాధితులను పరామర్శించేందుకు వెళ్లే క్రమంలో పోలీసులు తమను అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించడాన్ని ఖండించారు. అరెస్ట్ అయిన వారిలో విద్యార్థి, యువజన నాయకులు రవినాయక్, శ్రీహరి, శేఖర్, హరిమోహన్, దేవేందర్ ఉన్నారు.

డైనేజీ పనులు ప్రారంభం

డైనేజీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, నవంబర్ 18 : మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరైన రూ.5కోట్లతో నిర్మించనున్న డైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. రోడ్డు నిర్మాణానికి, డైనేజీ పనులకు అడ్డుగా ఉన్న ఇండ్లను, ఇండ్ల ముందు ఉన్న మెట్లను తొలగించుకొని సహకరించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలి : ఎంపీడీఓ

సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 18 : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు ప్రతి కుటుంబ సభ్యుడి వివరాలను నమోదు చేయాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం, సర్వేపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలందరూ సర్వేకు సహకరించాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీఓ లోకేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి అర్బన్, నవంబర్ 18 : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ క్లబ్ చైర్మన్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడంతో చదవుపై శ్రద్ధ పెరుగుతుందన్నారు. గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత బాగాయత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి టి.మధుసూదన్‌రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

రైతు సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన

భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న రైతు సమాఖ్య పాలకవర్గ సభ్యులు

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 18 : మండల కేంద్రంలో రైతు సమాఖ్య భవన నిర్మాణ పనులకు మండల రైతు సమాఖ్య పాలకవర్గ సభ్యుడు జక్కిడి మేఘారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమాఖ్య భవన నిర్మాణానికి సహకరించిన కలెక్టర్, తాసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పుష్పారెడ్డి, నగేశ్, మాధుసూదన్‌రెడ్డి, శంకరయ్య, సాలమ్మ, శేఖర్, అంజమ్మ, యాదయ్య, గాలయ్య పాల్గొన్నారు.